హాన్స్ బెండర్

# తీర్థయాత్ర

"అప్పుడు పసితనం నాకు - కలకల్లాడే మా ఇంటి ఆవరణలో-
ఆపిల్ కొమ్మల కింద పచ్చిక ఎంత పచ్చనో - అంత హాయి అప్పుడు -
-డిలాన్ థామస్

ఆనా లాగు ఎక్కిస్తుంటే, వంట యింట్లో బల్లమీద, నీరసంగా నిద్రమత్తుతో నిలబడ్డాడు హాన్స్.

"నువ్వు కాస్త తొందరగా తయారవు. కాఫీ అయినా తాగుదాం," అన్నాడు నాన్న.

"పొట్టి మొండి పిల్లాడు, లేకపోతే ఎప్పుడో అయిపోయేది," అంది ఆనాడు లాగుమీది పట్టీలు భుజాలకు బిగుతుగా తగిలిస్తూ; లోకమంతా నిద్రపోతుండగా తనను అంత పెందరాళే లేపినందుకు కసితీర్చు కుందుకులాగ. హాన్స్ బల్లమీదినించి కిందికి దూకాడు. జోళ్ళు మాత్రం తనే తొడుక్కోవాలి. కొత్త పసుపు పచ్చజోళ్ళు. చిల్లులున్నాయి వాటికి. నడుస్తుంటే పాదాలకింద వంగినప్పుడు కిర్రుమంటాయి.

ఆనా - కప్పుడు, మార్మలేడూ, రొట్టి, కాఫీ బల్లమీద అమర్చింది. కాని వాసన కమ్మగా ముక్కుకి తగిలి ఊరించింది. అప్పు డమ్మొచ్చి, "ఈ వేళ మనం కాఫీ తాగకూడదు," అంది.

నాన్న అప్పుడే బల్ల దగ్గర కూచున్నాడు. "ఎందుకు తాగకూడదు" అన్నాడు.

"ఆ మాత్రం తెలీకపోతే, ఇంక ఏం చెప్పేది?" అంది అమ్మ.

ఆ మాటల్లో ఎత్తి పొడుపు అమ్మ వీపులో కూడా కనబడింది. అద్దంముందు నిలబడి, హాట్‌లోంచి పొడుగాటి సూది గుచ్చుకుంటోంది జుట్టులోకి.

నాన్న కాఫీ చప్పరిస్తున్నాడు. ఆనా ఇంట్లోనే ఉంటోంది గనక, ఆమెకీ నిషిద్ధం లేదు. బల్లదగ్గర విశాలంగా కూర్చుని, రొట్టి ముక్కలు చేసి తన కప్పులో వేసుకుంటోంది. అమ్మ ఆనాని పొయ్యి దగ్గరకు రమ్మంది. గిన్నెల మీద మూతలు వేసి, మధ్యాహ్నానికీ, సాయంత్రానికీ ఏం వండాలో చెప్పింది.

"చీకటి పడకుండానే మేం తిరిగి వొచ్చేస్తాం," అంది అమ్మ.

ఇంటిముందు నాన్న కారు స్టార్ట్ చెయ్యడం మొదలుపెట్టాడు. రెనాల్ట్ కారది. నల్లటి ఎత్తు చక్రాలు, రేడియేటర్‌కి మూత ఉంది. ఇంజన్ చల్లబడిన మూలాన్ని నత్తిగా దగ్గింది. హరాం చేసింది. నాన్న నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు. మళ్ళీ స్విచ్ నొక్కాడు. కారుమీద చిరాకుపడ్డాడు. అప్పుడు ఇంజన్ అందుకుంది. గజగజలాడుతున్న కారులోకి అమ్మా, హాన్సూ ఎక్కారు; అమ్మ ముందు సీట్లో. హాన్స్ వెనకసీట్లో, నాన్న తన సీట్లోకి ఎక్కి గేర్ వేశాడు. ఆనా ఇంట్లోంచి హడావిడిగా వచ్చి, "హాన్స్, టోపీ మరచిపోయాడు," అంది.

మెల్లగా కారు ఆవరణలోంచి వీధిలోకి తిరిగింది. వీధిలో అలికిడి లేదు. కాళీగా ఉంది. జూన్ నెలలో సూర్యోదయానికి ముందు పల్లెటూరి వీధు లల్లాగే ఉంటాయి. లోయలో వాగునీళ్ళమీద ఆవిరి మంచు తేలుతోంది. తూర్పుని కొండకి వెనకాల సూర్యుడు పైకి లేస్తున్నాడు. వెండి పళ్ళున్న సన్నని రంపంలాగ. ఆ తరవాత మండుతున్న బంతిలాగ. చూస్తే కళ్ళు మిరిమిట్లు గొలుపుతాయి. కొంతసేపు ఏమీ చూడలేవు.

వాళ్ళు దాటుతున్న పల్లెల్ని సూర్యుడు మేలుకొలుపుతున్నాడు. ఆవులు వీధుల కడ్డంగా తడుముకుంటూ నడుస్తున్నాయి. గుర్రాలు నీరు త్రాగడానికి సాగుతున్నాయి. కర్రలతొట్టెదగ్గరికి, తుప్పుపట్టిన కుళాయిల్లోంచి నీళ్ళు మెరుస్తూ పడుతున్నాయి వాటిలో. కప్పుల్లేని బళ్ళు, దొడ్ల తలుపులు తెరుచుకుని ఇవతలి కొస్తున్నాయి. తొట్లమీద కూర్చుని పాలేర్లు అడ్డొచ్చిన ఆవుల్నీ, గుర్రాల్నీ అదలిస్తున్నారు.

పచ్చికబయళ్లు, తరవాత అడవులు. ఆకుసందుల్లోంచి వడబోసిన ఎండ కారుమీద వెలుగుమచ్చలు వేస్తోంది. కారు నడుపుతున్న నాన్నమీదా, జపమాల తిప్పుతూ పెదవులతో మౌనంగా జపం చేసుకుంటున్న అమ్మమీదాకూడా ఎండ మరకలు పడుతున్నాయి.

"కార్లో తీర్థయాత్ర వెళ్ళడం నిజంగా మంచిదికాదు," అంది అమ్మ "అంతా నడిచివాస్తారు ట్రీర్‌నించి. ఫుల్డానించి, వుర్జ్‌బర్గ్‌నించి, కొలోన్ నించి కాలినడకని వస్తారు. ధ్వజాలూ, సిలువలూ పట్టుకొస్తారు. జబ్బువాళ్ళని మోసుకొస్తారు. కొందరు చెప్పుల్లో సూదులూ, బటాణీలూ కూడా వేసుకు నడుస్తారు.

"ఉడక బెట్టిన బటాణీలు," అన్నాడు నాన్న, నవ్వాడు.

ఈలవేస్తూ, మరికాస్త గట్టిగా ఆక్సిలరేటర్ తొక్కాడు. కిలోమీటర్ ముల్లు 60దాకా పోయింది.

"పోనీలెండి, మీకు నమ్మకం లేకపోయినా మమ్మల్నైనా కార్లో తీసికెడుతున్నారు. ఏదో మంచిపని చేస్తున్నారు. ఆ భగవంతుడికి మీమీద ఎప్పటికన్నా దయ కలక్కపోదు," అంది అమ్మ.

"ఏమిటీ పుణ్యక్షేత్రం మహత్తు?" అని అడిగాడు నాన్న.

"దివ్యరక్తం స్రవించిం దిక్కడ," అమ్మ అక్కణ్ణించి ఆ విచిత్ర కథ నాన్నకి చెప్పడం మొదలుబెట్టింది. క్రితం రాత్రి హాన్స్‌ని పడుకోబెడుతూ అతనికి చెప్పింది. ఆరువందల సంవత్సరాల క్రితం, ఒక పురోహితుడు పూజ సాగిస్తుండగా ప్రభువు మధుపాత్ర క్రిందపడింది. అర్చావేదిక మీద పరచిన వస్త్రంమీద మధువుకు బదులుగా రక్తం స్రవించింది. ఆ రక్తం, ఆ ధవళ వస్త్రంమీద కంటక కిరీటధారి యయిన జగద్రక్షకుడి శిరస్సులు, పన్నెండు చిత్రించింది.

"ఆరువందల ఏళ్ళ క్రితమా?" అన్నాడు నాన్న, అపనమ్మకంగా.

"ఈ ఉత్సవదినాన వెండి మందిరంలో పెట్టి, ఆ పవిత్ర వస్త్రాన్ని అందరికీ చూపిస్తారు - మీరిద్దరూ చూస్తారుగా"

కొండమీద ఒక దుర్గముంది. ఒక బురుజుమీద జెండా ఎగురుతోంది.

"రైతు మహాయుద్ధంలో అది శిథిలమైపోయింది," అన్నాడు నాన్న.

ధాన్యపుచేలు, కొండ క్రిందినుంచి పైకీ, పైనించి క్రిందకీ పరుచుకున్నాయి, పసుపు, బంగారు చుక్కల్లా చేలంతటా పువ్వులూ, గింజలూ.

"మనదేశాని కిది ధాన్యపుకొటారు. మీకు బళ్ళో చెపుతారులే," అన్నాడు నాన్న.

అమ్మ బాధగా జపమాల తిప్పుతోంది, మంత్రాలు గొణుక్కుంటూ. కారు చిరాకు పడుతూసాగింది. దారంతా గొప్పులు. రాళ్ళగిరి రేడియేటర్‌మీద తగులుతున్నాయి. వెనకాల దుమ్ము మేఘాలు, పసుపు పచ్చగా, కాస్త రెక్క లాడించి, దూరాన్ని చేలమీద వాలిపోతున్నాయి.

రేడియేటర్‌లో నీళ్ల మరీ వేడెక్కడం మూలాన్ని, నాన్న రెండుసార్లు కారు ఆపాడు, మూత తెరవగానే, వేడినీళ్ళు అతని చేతిమీద కొట్టాయి.

"అబ్బ! దీని దుంపతెగ," అన్నాడు నాన్న. ఆకాశంలో నక్షత్రాలు రాలిపోవాలనీ, వీధుల్లో దెయ్యాలు విహరించాలనీ, ఈ 'ధాన్యపు కొటారం' దుంప నాశమైపోవాలనీ శాపనార్థాలు పెట్టాడు.

"వొద్దు శాపనార్థాలు పెట్టొద్దు. తప్పుడు మాటలు నోటితో ఉచ్చరించకూడదు, మనం వెడుతున్నది తీర్థయాత్రకి," అంటూ గోలపెట్టింది అమ్మ.

మొట్టమొదట బురుజులు కనిపించాయి. ఊరు కొండమీద ఎత్తుకి ఉంది. ఇంటి కప్పులమీద ఎత్తుగా కనబడుతుంది చర్చి.

"జెరూసలం ఇలాగే ఉండి వుంటుంది." అంది అమ్మ.

"కారు అల్లరి పెట్టకపోతే పదిహేను నిమిషాల్లో చేరుకుంటాం. ఈ ముసిలి ఘటానికింత ఎత్తు కష్టమే."

అమ్మ భక్తిగా, ఆనందంగా, మంత్రాలు జపిస్తూ, ఆ పుణ్య తీర్థం వంక చూసింది.

"ఏనుగుని మింగేటంత ఆకలేస్తోంది నాకు. నీకు రా హాన్స్?" అన్నాడు నాన్న.

"నాకూను!"

"అయ్యో, మీ కిద్దరికీ తిండితిప్ప మరో గొడవలేదు," అంటూ నిట్టూర్చింది, అమ్మ.

పసుపు – తెలుపు, నీలం – తెలుపు జెండాలు ఇళ్ళ కిటికీల నించి వేళ్ళాడుతున్నాయి ఊరంతా. "రీక్ షాఫెల్ ఆహారశాల" ముందు కారాపాడు నాన్న. అతనికీ అమ్మకీ మధ్య వాగ్వాదం కొంత జరిగింది. ఆఖరికి అమ్మ నెమ్మదిగా, సరే, నేను ముందు వెడతాను. మీరిద్దరూ తరవాత రండి," అంది.

ఆ సన్నని వీధిలో గబగబా నడుస్తూ వెళ్ళిపోయింది.

నాన్న బార్‌లో నిలబడి మూడుసార్లు గట్టిగా అరిస్తేగాని వంటింట్లోంచి ఎవరూ బయటికి రాలేదు. ఆఖరికి ఒక అమ్మాయొచ్చింది, గంజిపెట్టిన తెల్లని బురఖా నల్లటి దుస్తులమీద కట్టుకుంది మరకల వకండా.

"జనమే లేరే,' అన్నాడు నాన్న.

"ఇంకా వేళ కాలేదు. యాత్రికులంతా ఇంకా చర్చిలో ఉన్నారు, అంది అమ్మాయి.

"మేం మాత్రం యాత్రికులం కాదూ? మేమిక్కడే ఉన్నామే–" అన్నాడు నాన్న.

"కార్లో వొచ్చే యాత్రికులు - అంత లెక్కలోకి రారు," అంది అమ్మాయి.

"కార్లో రావడమూ కష్టమే. అంత దరిద్రపు ఊరు మీది. ఒక్క రోడ్డుమీద తారన్నా పుయ్యలేదు."

"తినడాని కేమన్నా కావాలా?" అంది అమ్మాయి చిరాకుగా.

"కావాలి, తినడానికీ తాగడానికీ. సాసేజెస్ - ఒక ప్లేటు - కాస్త మధువు పట్టుకురా. ఈ కుర్ర పెద్దమనిషికి ఒక లెమనెడ్ - ఏ రకం కావాలిరా?"

"ఆకుపచ్చనిది," అన్నాడు హాన్స్.

"ఒక వాల్ మీస్టర్‌బుడ్డి అన్నమాట," అంటూ, ఆ అమ్మాయి కౌంటర్ వెనకాల తలుపులోంచి అదృశ్యమైపోయింది.

ఆమె వెళ్ళడం నాన్న పరీక్షగా చూశాడు. చేతులు తృప్తిగా రాసుకున్నాడు. హాన్స్ వేపు చూసి, "ఏనుగును మింగేటంత ఆకలివేస్తోంది నాకు," అన్నాడు మళ్ళీ.

"నాకూను."

అమ్మాయి గ్లాసులు, లెమనేడ్‌బుడ్డీ తీసుకొచ్చింది.

"మధువేమన్నా మంచిది ఉందా?" అని అడిగాడు నాన్న.

"రుచి చూచిన వాళ్ళంతా ఎంతో మెచ్చుకుంటారు."

"నేనసలు ఇందులో చాల ఆరితేరినవాణ్ణి తెలుసా?" అన్నాడు నాన్న అమ్మాయి వీపు చరుస్తూ.

ఆమె కత్తులూ, పోర్కులూ, అమరుస్తుంటే, నాన్న ఆమెతో ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. నాన్నగొంతు మామూలుగా లేదు, కాస్త మెత్తబడింది. సున్నితపడింది.

ప్లేటుమీద రకరకాల 'సాసేజెస్' ఉన్నాయి, ఎఱ్ఱని లియాన్, ముదురు రంగు 'హామ్', 'కాలేయం,' 'సలామీ' తెల్లని కరకరలాడే వేపుడుతో కూడిన పందిమాంసం, ఇంకా ఎన్నో. ఉల్లిపాయలూ, దోసకాయలూ, సన్న చీలికలుగా చేసి, ప్లేటు అంచుని అందంగా పేర్చి ఉన్నాయి. దోర ఎర్రగా కాల్చిన రొట్టి చీలికలు దొంతరగా ఒక చిన్న బుట్టలాంటి దానిలో పేర్చి ఉన్నాయి.

"అన్నీ మంచి రుచిగా ఉన్నాయి, మంచి రుచి," అన్నాడు నాన్న, ఉత్సాహంగా.

"నీకు బాగున్నాయా?"

హాన్స్ నోరు నిండుగా ఉంది. తలవూపాడు.

"వాడికి తప్పకుండా బాగుండాలి. ఇంటి దగ్గరకన్నా, నాకు మా యింటి దగ్గరకన్నా బాగుంది," అన్నాడు నాన్న అమ్మాయివంక చూస్తూ.

"మీకు నచ్చినందుకు సంతోషం."

"ధన్యవాదాలు బాగుంది."

రొట్టి, సాసేజెస్, లెమనేడ్, అన్నీ గబగబా పూర్తిచేశాడు హాన్స్, తాపీగా తాగమని చెప్పడానికి అమ్మ దగ్గర లేదు. పలక మారింది. నాన్నా, ఆ అమ్మాయీ నవ్వారు. ఒకళ్ళకొకళ్ళు ఎంతోకాలంగా ఎరుగున్నట్టు. తన ప్లేటు ఖాళీ చేశాక, హాన్స్ కుర్చీలో ముందుకీ వెనక్కీ జరగడం మొదలుపెట్టాడు. నాన్న మూడో గ్లాసు మధువు పట్టుకురమ్మన్నాడు, చెప్పేటప్పుడు అమ్మాయి చెయ్యి పట్టుకున్నాడు.

హాన్స్ వంక చూసి, "కూర్చుంటే నీకు విసుగెత్తినట్టుంది. పోనీ నువ్వు ముందు వెళ్ళరాదూ?" అన్నాడు నాన్న.

"అల్లాగే."

హాన్స్ బయటికొచ్చాడు. సన్నని వీథి వెంట నడిచివెళ్ళాడు. చర్చి ఎత్తుగోడలు, వీథి చివర అడ్డుగా నిలబడ్డాయి. దూరంగా 'ఆర్గన్' వాద్యం వినబడుతోంది. కాని హాన్స్ టోపీ మరిచిపోయాడు. అత నెప్పుడూ టోపీ మరచిపోతుంటాడు. సన్నని వీథి వెంట వెనక్కి నడిచి వెళ్ళాడు. నాన్న నవ్వినప్పుడు మహాచిన్నతనం అనిపించిం దతనికి.

హాన్స్, తలుపు తెరవగానే, నాన్న ప్రక్కని అమ్మాయి కూర్చుని ఉండడం చూశాడు. అమ్మాయి భుజం చుట్టూ నాన్న చెయ్యి ఉంది. వాళ్ళిద్దరూ అవతల ప్రక్కకి తిరిగి కూచున్నారు. అంచేత హాన్స్ తలుపు తెరవటం, ముయ్యడం వాళ్ళు గమనించలేదు.

చర్చి ముందున్న ఆవరణకి రెండు ప్రక్కలా వీధు లున్నాయి. ఆ వీధుల్లోంచి వస్తున్నారు యాత్రికులు. పాడుకుంటూ ముందుకి వస్తున్నారు. సిలువలూ, ధ్వజాలూ వాళ్ళపైన వేలాడుతున్నాయి. పురోహితులూ, వటువులూ ముందు నడుస్తున్నారు. గడ్డమున్నాయ నొకడు గడలతో కట్టిన పెద్ద సిలువను మోసుకుపోతున్నాడు. గడలు చెట్టు మొదళ్ళంత లావుగా ఉన్నాయి. భుజాలకు కట్టేసి మోసుకుపోతున్నాడు - అమ్మ గదిలో ఉన్న క్రీస్తు బొమ్మలోలాగ. ఆడపిల్లలు మైనపు వత్తులు, వేపరెమ్మలు, అడవి పువ్వులు - మంచి వాసన ఉన్నవి పట్టుకొస్తున్నారు.

కుడిప్రక్కనుంచి వొస్తున్న యాత్రికులు పాడుతున్న పాట వేరు, ఎడమ ప్రక్కనించి వొస్తున్న వాళ్లు పాడుతున్నది వేరు. రెండు పాటలూ కలిసి వినబడుతున్నాయి. చర్చి బురుజుమీద తెరిచిఉన్న కిటికీలలో, గంటలు పెద్దగా ఊగుతున్నాయి. వాటి ధ్వని పాటల్ని ముంచేసింది. చర్చి గుమ్మంలోనించి ఆర్గన్ మోత చెవులు గింగురుమనేటట్టు వస్తోంది.

రెండు ఊరేగింపులూ, కలిసినప్పుడు హాన్స్ మధ్యలో చిక్కుకున్నాడు. జనం అతన్ని గుమ్మంలోనించి, పెద్ద ఎత్తైన చర్చిహాలులోనికి నెట్టుకుపోయారు. సూర్యకాంతి, గుత్తులు గుత్తులుగా, రంగులు రంగులుగా, ఆ చీకటికి ఇటూ అటూ చీలుస్తోంది. ఎత్తైన అర్చావేదిక వెలుగుతున్న కొవ్వత్తుల పర్వతంలాగ ధూపపు తెర వెనక ధగధగ లాడుతోంది. ఎందరో పురోహితులు, తెల్లని బంగారపు దుస్తులు ధరించి, వేదిక మెట్లమీద నిలబడ్డారు. వటువులు తెల్లని, ఎర్రని దుస్తుల్లో, ధ్వజాలు సిలువలూ ఒక ప్రక్కనించి రెండో ప్రక్కకి మోసుకుపోతున్నారు. ముగ్గురు కాస్త పెద్దపిల్లలు సాంబ్రాణి భరిణెలు ఊపుతున్నారు. చిక్కని దూదిలాంటి పొగలొస్తున్నాయి వాటిలోంచి. మరీపైని, గుండ్రని చర్చి కప్పుకి కొంచెం కింద పెద్ద బొమ్మలున్నాయి. వాటి యెదట కిటికీలున్నాయి. పిచికలు ఒక కిటికీ మీదనించి మరో కిటికీ మీదికి ఎగురుతున్నాయి. వాటి కిచకిచలు, యాత్రికుల పాటలో ఆర్గన్ మోతలో, మెల్లగా కలిసిపోతున్నాయి. చర్చి కప్పు ఎండాకాలపు ఆకాశమా అన్నట్టు.

యాత్రికులు ప్రక్కనున్న వేదికవేపు ఒత్తుకుంటూ పోతున్నారు. ఈ వేదిక మీద, ఎత్తునున్న వేదిక మీదికన్నా ఎక్కువ కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. వాటి వేడికి కొవ్వొత్తులు

అవే వంగుతున్నాయి. కరగిన కొవ్వు అర్చావేదికమీద పరచిన వస్త్రంమీద, అలంకరించిన నీలం పువ్వులమీద కారుతోంది.

వాసనగా అస్థిరంగా వెలుగుతున్న కొవ్వొత్తుల వెలుగులో వెండి గర్భగుడి తళతళ మెరుస్తోంది. జరీ పూసిన దివ్య వసనం దానిమధ్యఉంది. రక్తపు మరకలున్నాయి ఆ వసనం మీద – అమ్మ చెప్పినట్టు. శిరస్సులు గుర్తుపట్టడానికి వీలుగా లేవు గాని, ఇదే దివ్య వసనం. యాత్రికులు పైకి ఎక్కడం ప్రారంభించారు. అంచేత వాళ్ళ అడుగులు తడబడ్డాయి. అందరూ మోకరించారు, అర్చావేదిక ముందు. మెట్ల మీదున్న సిలువను ముద్దు పెట్టుకున్నారు. ఒక పురోహితుడు గొంతెత్తి ప్రార్థన ప్రారంభించాడు.

"ఓ దివ్య పవిత్ర రక్తమా!"

"మమ్ము రక్షించు," అన్నారు యాత్రికులు.

"ఓ దివ్య పవిత్ర రక్తమా!"

"మమ్ము రక్షించు," అన్నారు యాత్రికులు.

అందరికీ రక్తవసనమున్న గర్భగుడి దగ్గరకు పోవాలని ఆత్రం. బల్లల వరసల మధ్య ఇరుకుదారిలో తోసుకుపోతున్నారు. ఒక వరసలో ఉంది అమ్మ. ఆమె కళ్ళు – తెల్లని కింది గుడ్డే కనబడుతోంది – గర్భగుడివంక తదేకంగా చూస్తున్నాయి. ఆమె పెదవులు ప్రార్థన జపిస్తున్నాయి. అమ్మని చూసేసరికి హాన్స్ మనస్సు ఆనందపడింది. మెల్లగా ఆ వరసలోకి దూరి అమ్మ పక్కకి చేరుకున్నాడు. కాని కొన్ని క్షణాలవరకూ అతన్ని ఆమె చూడలేదు. చూచిన తరువాత అతని చెయ్యిపట్టుకుని,

"ప్రార్థించు, నాన్నగారిమీద ప్రభువుకు దయకలగాలని," అని మెల్లగా చెప్పింది.

ప్రభువు దయ? దాని అర్థం ఏమిటో హాన్స్‌కి తెలియదు. పసితనంలో నేర్చుకున్న ప్రార్థన జపించాడు. ఎందుకో ఇక్కడ ఆ ప్రార్థన సరిపడినట్టులేదు. రెండుసార్లు జపించేసరికి నాన్నా, ఆ అమ్మాయి గుర్తుకొచ్చారు. అది పాపం నాన్న చేతులు అమ్మభుజాల్ని చుట్టి ఉండాలి. ఒకనాటి రాత్రి, పడకగదిలో అమ్మా నాన్నా వాదించుకుంటూ ఉంటే, అతనికి మెలుకువొచ్చి విన్నాడు.

ప్రభువు దయ, నాన్న అమ్మని అప్యాయంగా చూసేటట్టు చేస్తే తప్పకుండా ప్రభువుని ప్రార్థిస్తాడు. హాన్స్ గొంతెత్తి, యాత్రికులతోబాటు హృదయపూర్వకంగా ప్రార్థించాడు.

"మమ్ము రక్షించు తండ్రీ!"

"మమ్ము రక్షించు తండ్రీ!"

చర్చిముందు, మధ్యాహ్నపు టెండలో నాన్న నిలబడి ఉన్నాడు. హాన్స్‌కి టోపీ అందించాడు. నవ్వాడు. ఎండకు కళ్ళు చికిలించాడు. కొంచెం తూలాడు.

"ఆహా! ఎంత దివ్యంగా జరిగింది, మీరు చూడలేదుగాని," అంది అమ్మ.

"చూడకేం? నేనూ వొచ్చా లోపలికి. ప్రభువు ఆశీర్వచనం నాకూ దొరికింది." అన్నాడు నాన్న.

"పోనీ ఆశీర్వచనమన్నా దొరికింది." అంది అమ్మ.

చర్చిముందు ఆవరణలో పచ్చికమీద కొందరు యాత్రికులు కూర్చున్నారు. కొందరు నడుం వాల్చారు. స్త్రీలూ, పిల్లలూ, తెచ్చుకున్న రొట్టెముక్కల దొంతరలు కొరుక్కుతింటున్నారు. మగవాళ్ళు బీర్‌సీసాలు తాగుతున్నారు. కొందరు జేబురుమాళ్ళు తలలకు చుట్టుకున్నారు. కొందరు గొడుగులు విప్పి, వాటి నల్లటి నీడలో నిద్రపోతున్నారు.

"హాన్స్‌కి తప్పకుండా తీర్థం చూడాలనుంది," అన్నాడు నాన్న.

"తీర్థంకూడా ఉందా!"

"ఆ, యాత్రికులకోసం తీర్థముండదూ? అయితే ముందు అమ్మేదన్నా తినాలి."

"అబ్బ, ఏనుగుని మింగేటంత ఆకలేస్తోంది నాకు," అంది అమ్మ.

వాళ్ళు నవ్వుకుంటూ, "రీక్‌షాఫెల్" ఆహారశాలకి వెళ్ళారు. క్రిక్కిరిసిన జనం మధ్య చోటు చేసుకుని కూర్చుని, మధ్యాహ్నం భోజనం ముగించారు. వడ్డించే అమ్మాయి, ఒక టేబిల్ దగ్గరనుంచి మరో టేబిల్ దగ్గరకు హడావిడిగా తిరుగుతోంది. నాన్నతో మాట్లాడ్డానికి ఆమెకు తీరికేలేదు. అదే మంచిది.

దుకాణాలకోసం వేసిన డేరాలమీద ఎండపడి, కిందికి పసుపుపచ్చగా దిగుతోంది వెలుగు. చొక్కాలు, జాకెట్లు, టోపీలు, హాట్లు, మేజోళ్ళు దుకాణాల ముందు వేలాడుతున్నాయి. దుకాణదారులు ఆడా మగా, వాటివెనక నిలబడి అమ్ముతున్నారు. ఒక డేరా రకరకాల లేసులతో నిండిఉంది. లేసు చుట్టలు విప్పి, తన ఒళ్ళంతా వేళ్ళాడేసుకుని ఆడవాళ్ళని ఆకర్షిస్తున్నాడు దుకాణదారు, బొంగురు గొంతుకతో అరుస్తూ.

"లేసేమన్నా కావాలా?" అన్నాడు నాన్న.

"అక్కర్లేదు," అంది అమ్మ.

కుండలు పేర్చి ఉన్నాయి. ఎర్రటి పచ్చటి దాకలు, పెద్దబానలు, మట్టి పళ్లాలు, ఆష్‌ట్రేలు, రంగురంగుల బొమ్మలు వేసినవి, పింగాణీ కంచాలు ఎన్నో ఉన్నాయి. దుకాణాల మధ్య సందుల్లో యాత్రికులు రాసుకుంటూ, తోసుకుంటూ పాత్రలు మోగించి పరీక్షచేసి బేరమాడి, కొనుక్కుని, చంకలకింద పెట్టుకుపోతున్నారు.

"నీకో మంచి కంచం కావాలా?" అని అడిగాడు నాన్న.

"అక్కర్లేదు," అంది అమ్మ.

పూసల దుకాణాలున్నాయి, లక్కబొమ్మలు, దేవుళ్ళపటాలు, విగ్రహాలు, చిన్నిచిన్ని రాక్షసుల బొమ్మలు, దివ్యపాత్రలున్నాయి. వాటిలో. దివ్యవస్త్రం కూడా అమ్ముతున్నారక్కడ. దానిమీద మన 'రక్షకుడి' పన్నెండు శిరస్సులూ అతి స్పష్టంగా అచ్చుగుద్దారు ఎర్రరంగులో. "ఇది ఒకటి కొనుక్కుంటావా?" అని అడిగాడు నాన్న.

"కొంటా. ఒకటి - కాదు రెండు. ఆనా కొకటిద్దాం."

"ఇంకేమన్నా కావాలా?"

రంగుల రాట్నం గుండ్రంగా తిరుగుతోంది. మర ఉయ్యాల లూగుతున్నాయి. నోళ్ళు తెరచుకొన్న కర్ర గుర్రాలమీద, ఊగే బాగులమీద కూర్చుని కళ్ళాలూ, ఊచలూ పట్టుకుని గిరగిర తిరుగుతున్నారు. వాళ్ళ చుట్టూ పెద్ద చెక్కల మీద రంగురంగుల దేవతల బొమ్మలూ, మరుగుజ్జులు, కలువ పువ్వులు చిత్రించి వున్నాయి. రంగులరాట్నానికి

ఇటూ అటూ పెద్ద అద్దాలు, వాటి మధ్య జరీపూసలు, కుట్టిన గుడ్డలు వేళాడుతున్నాయి. కొంచెం పెద్ద పిల్లలు పైనున్న పెద్ద చట్రంలోంచి గెంతుతూ పెద్దగా అరుస్తున్నారు. ఏదో అపాయంలో చిక్కుకున్నట్టు.

"గుర్రమెక్కుతావా, మర ఉయ్యాలెక్కుతావా?" అని అడిగాడు నాన్న.

"గుర్రం – ఆ బూడిదరంగు జీనున్నది," అన్నాడు హాన్స్.

అతను వాళ్ళ ముందునుంచి దూసుకుపోతున్నప్పుడు అమ్మానాన్నా చేతులూపేవారు. వాద్యాలు చెవులు గింగురుమనేలా మోగుతున్నాయి. వాద్య బృందం నడిపేవాళ్ళు యంత్రాల్లా చేతులూపుతున్నారు. గంట మోగింది. వేగం తగ్గింది. ఎవరో బలవంతంగా ఆపుతున్నట్టు. గుర్రాలూ, హంసలూ, పడవలూ దడదడలాడుతూ ఆగాయి.

"కళ్ళు తిరిగాయా?"

"అబ్బే."

పిల్లలు రేకు బూరా లూదుతున్నారు. వెదురు గొట్టాలూదుతున్నారు. కాగితపు పాములూదుతున్నారు. అవి ఊదినప్పుడు తోకకి తగిలించిన ఈకదాకా తెరుచుకుంటున్నాయి. వందలకొద్దీ మిఠాయి దినుసులు పర్వతాల్లా పేర్చి ఉన్నాయి. ఏటవాలు బల్లలమీద – కాఫీ దుకాణాలముందు.

"అల్లం మురబ్బాతో చేసిన రొట్టిది – ఇది కావాలా? పేలవుండలు కావాలా?" అని అడిగాడు నాన్న.

"ఆ మంత్రాల సంచీ కావాలి," అన్నాడు హాన్స్.

"ఏడిసినట్టుంది – సరే ఒకటియ్యి," అన్నాడు నాన్న, అమ్ముతున్న పిల్లతో.

"లోపలేమున్నా సరే దిగులుపడకూడదు మరి," అంది అమ్మ.

"లోపల రెండు రకాల మిఠాయిలూ, ఒక రేకు వాచీ ఉన్నాయి. రేకు వాచీకి రబ్బరు తాడుంది. ముల్లు డయల్ మీద నల్లగా గీసి ఉన్నాయి.

"టైమెంత?" అన్నాడు హాన్స్.

నాన్న గడియారం వంక చూసి, "ఏడైంది! నీ గడియారం అయిదు గంటలు ముందుంది. ఏడయ్యేసరికి మనం ఇంటి దగ్గరే ఉంటాం," అన్నాడు.

అమ్మ వెనక్కి తిరిగి ఒక్కసారి ఆ పుణ్యక్షేత్రంవంక చూసింది. తరవాత ఎత్తు బురుజులు కొంత వెనక మాటుపడిపోయాయి.

"ఎంత బాగుంది. ఎంత దివ్యంగా ఉంది!" అంది అమ్మ.

సూర్యుడు, పెద్దనారింజ బంతిలాగ, శ్రోవ్ మంగళవారంనాడు తెల్లారగట్ట వేళ్లాడదీసే బుట్టదీపం లాగ, కింది సగం నల్లరంగు పూసినట్టు, రోడ్డూ ఆకాశం కలిసేచోట దూరంగా కనబడుతున్నాడు. నాన్న కారుని సూర్యుడిలోకి నడుపుతున్నాడా అనిపించింది. వరిచేల మీదినించి నునువెచ్చని గాలి వీస్తోంది. కాని ఆ చిట్టడివిలో దారి కడ్డంగా పరుచుకున్న సరుగుడుచెట్ల నీడలు మట్టుకు సాయంత్రం పడినకొద్దీ చల్లబడుతున్నాయి. నాచు వాసన తడితడిగా తగులుతోంది. పొలాల్లోంచి ఆవిరిమంచు గాలిలోకి లేస్తోంది.

"ఏదో కాలుతున్నట్టు లేదూ?" అన్నాడు నాన్న.

ముగ్గురూ ముక్కు రంధ్రాలు పెద్దవి చేసి వాసన చూశారు. నాన్న కారు అతి మెల్లగా నడుపుతున్నాడు, దానితో పరుగెత్తొచ్చుకూడా.

"అబ్బే, ఏవీంలేదు." అన్నాడు నాన్న. కారువేగం హెచ్చించాడు.

అమ్మ వెనక్కి తిరిగి, "టోపీ పెట్టుకోరాదూ?" అంది.

"గాలి తగులుతుంటే బాగుంది," అన్నాడు హాన్స్.

"జలుబు చేస్తుంది."

"టోపీ పెట్టుకో," అన్నాడు నాన్న కాస్త గట్టిగా.

రైతు మహాయుద్ధంలో చచ్చిపోయిన దూడలమందలిప్పుడు అవతల ప్రక్కనున్నాయి. ప్రయాణం వేగంగా సాగిపోతోంది, అన్నీ ఎరుగున్నవి కావడంచేత.

"మెల్లగా పోనివ్వండి. తొందరేముంది? వంట ఏమేం చెయ్యాలో ఆనాకి అన్నీ చెప్పే వచ్చాను," అంది అమ్మ.

"భోజనాలవేళకి చేరుకుంటాం ఇంటికి; ఏవన్నా మంచి పదార్థాలున్నాయా?" అన్నాడు నాన్న.

"లేగదూడ మాంసం పీలకలు చెయ్యమన్నాను. చిక్కుడు కాయల పులుసుంది."

"మాంసం మాడ్చెయ్యదుగదా," అన్నాడు నాన్న.

సూర్యుడి చక్రం చక్రుని కిందికిపోతోంది, గల్లాపెట్టిలోకిపోయే రూపాయి బిళ్ళలాగ. నీలి ఆకుపచ్చ ఆకాశం స్వచ్ఛంగా ఉంది. దానిమీద చంద్రుడు పొడిచాడు, సూర్యుడు సగం కరిగించిన మంచు ముక్కలాగ.

కారు కొండెక్కుతోంది. రేడియేటర్ చిల్లుల్లోంచి పొగ రావడం మొదలుపెట్టింది. నాన్న చటుకుని కారాపి తను బయటికి దూకేశాడు. రేడియేటర్ మూత ఎత్తాడు. చాకులా లేచింది మంట!

"దూకెయ్యండి, బయటికి," అని అరిచాడు.

"అమ్మా, హాన్సూ, రోడ్డుపక్క గోతిలోకి దొర్లిపడ్డారు, ఒకళ్ళమీద ఒకళ్ళు. రోడ్డుమీదినుంచి ఒకదాని వెనక ఒకటి రెండుసార్లు పేలిన శబ్దం వచ్చింది. కారు వెనక నల్లనిపొగ లుంగచుట్టుకుంటూ వచ్చింది.

మంటల్లో రేడియేటర్ కుతకుత ఉడికింది. పెట్రోలు, ఆయిలూ చక్రాల మీదికి చుక్కచుక్కగా కారుతోంది. వాటి తడి నాలుకలు రోడ్డు కడ్డంగా నాకు తున్నాయి. మంటలు వాటిని తరుముకుంటూ పోయాయి.

"ఏం చేద్దాం?" అంది అమ్మ. అవతలపక్కనున్న నాన్నతో.

నాన్న చెయ్యి పైకెత్తాడు. మెల్లగాదించాడు. "ఏముంది? ఏమీలేదు. దగ్గర్లో ఎక్కడా నీళ్లులేవు. ఉన్నాగాని ప్రయోజనంలేదు. పెట్రోల్ టాంక్ పగిలిపోయింది," అన్నాడు నాన్న.

"అయ్యో దేవుడా!" అంది అమ్మ.

"నిలబడి చోద్యం చూడాల్సిందే", అన్నాడు నాన్న. "హాన్స్ మహా బాగా మండుతోంది కాదురా?"

మంటలు పసుపుగా నీలంగా లేస్తున్నాయి. చలికాలంలో గడ్డిమంట ముందులాగ వెచ్చగా ఉంది.

కారు అద్దాలమీద పగుళ్ళు పాకాయి. తరవాత పేలి ముక్కలైపోయాయి అద్దాలు. నెరుసులు సీట్లమీద పడ్డాయి.

"సీట్లు కొత్తగా కుట్టించాం", అంది అమ్మ.

"కొత్తకారు కొందాం," అన్నాడు నాన్న.

"ఇంటికెల్లా చేరుకోడం? చీకటిపడుతోంది." అంది అమ్మ.

"ఇంటికా? ఏదన్నా కారొస్తే ఈ దారిని – అందులో ఎక్కిపోవచ్చు." నాన్న కారుచుట్టూ తిరిగాడొక్కసారి. నవ్వుతూ అన్నాడు, "ఇప్పుడు మనం సిసలైన యాత్రికులం."

నాన్న అమ్మ దగ్గరకొచ్చి నిలబడ్డాడు. అమ్మ భుజాలచుట్టూ చెయ్యి వేశాడు. మళ్ళీ నాన్న అవతలపక్కకి వెళ్ళినప్పుడు. అమ్మ హాస్‌తో మెల్లగా అంది.

"తిట్లూ చిరాకులైనా రావడంలేదు మీ నాన్న నోటంట, యాత్రప్రభావమే సందేహం లేదు. అంతా ప్రభువు చలవ."

(ఆంగ్లానువాదం : ఆర్.టి.కె. సైమింగ్టన్)